## తిరుపతిరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**శెనార్తి మీడియా, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన సిరికొండ తిరుపతిరావు కుటుంబాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం పరామర్శించారు. కుమారుడు అఖిల్ రావు మృతిని తట్టుకోలేక తిరుపతిరావు కూడా ప్రాణాలు విడవడం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. సుమారు రెండు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు ఇద్దరూ మృతిచెందడం దురదృష్టకరమన్నారు. భర్త, కుమారుడిని కోల్పోయిన శ్యామలను ఎమ్మెల్యే పరామర్శించి, తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు తూముల శ్రీనివాస్, జిల్లా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గుంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పొట్ట శ్రీనివాస్ యాదవ్, బుర్ర కనుకయ్యగౌడ్, గ్రామ ఉపాధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, నాయకులు మేడి అంజయ్య, తాళ్లపల్లి కొమురయ్య, శానగొండ నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీఐని కలిసిన రాష్ట్ర పద్మశాలి సమైక్య ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంత్ నేత



**శెనార్తి మీడియా, జమ్మికుంట**

జమ్మికుంట పట్టణ సిఐ గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ గౌడ్ ను శనివారం రోజున జమ్మికుంట పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సమైక్య ఉపాధ్యక్షులు సిలివేరు శ్రీకాంత్ నేత మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేయడం జరిగింది ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణంలో జరుగుతున్న పలు విషయాల తో పాటు గంజాయి మత్తులో పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని దాని విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా సిలివేరు శ్రీకాంత్ సిఐ రామకృష్ణ గౌడ్ ను కోరారు సానుకూలంగా స్పందించిన సీఐ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు

## జోగుపర్తి కుటుంబానికి కందాళ పరామర్శ



**శెనార్తి మీడియా, పాలేరు**

తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి ప్రసాద్ మృతితో దిగ్భ్రాంతిచెందిన మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చారు.బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భాష బోయిన వీరన్న, కూసుమంచి మండల నాయకులు ఇంటూరు శేఖర్, కొప్పుల ఉపేందర్ రెడ్డి, చంద్రు తండ మాజీ సర్పంచ్ మంచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

గన్నేరువరం మండల కేంద్రంలో శుక్రవారం హనుమాన్ భక్తులు భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ప్రతిష్టించి, రామలక్ష్మణ జానకీ జై బోలో హనుమాన్ అంటూ ప్రధాన వీధుల గుండా భజనలతో ఊరేగించారు. రామనామంతో మారుమోగిన ఈ శోభాయాత్ర పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో దొగ్గలి ప్రదీప్, బోయిని కుమార్, బుర్ర తిరుపతి గౌడ్, సాయి గౌడ్, జీల మధు, తాటికొండ తిరుపతి తో పాటు భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ–పాక్ కాల్పుల విరమణ ఒప్పందం

- **దేశానికి అవమానం**
- **బీఆర్ఎస్ నేత నడిపెల్లి విజిత్ కుమార్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత నడిపెల్లి విజిత్ కుమార్, బీజేపీ నేతృత్వంలోని పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందం దేశానికి గొప్ప అవమానం కలిగించినట్టు ఖండించారు. ఈ వ్యాఖ్యలు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బీజేపీ అధినాయకత్వంలో జరుగుతున్న తిరంగా యాత్రలు ప్రజలలో సందేహాలు సృష్టిస్తున్నాయని, అసలు ఎందుకు, ఏమిటీ సాధించినట్టు అని ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారని అన్నారు. పాక్‌తో కాల్పుల విరమణ ఎందుకు పూర్తిగా తెలియకుండానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనతో చేయడాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నామని అన్నారు. ట్రంప్ భారతదేశానికి అవమానం చేస్తూ భారత ప్రధాని, హోమ్ మినిస్టర్, విదేశాంగ మంత్రి ఎవరూ స్పందించకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తున్నదని, బీజేపీ ట్రంప్ మాటలనే అనుసరిస్తోందని అన్నారు. అలాగే, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన అనుచిత ట్వీట్‌లను పార్టీ అధినేతలు కూడా కట్టడి చేయడంలో విఫలమయ్యారని, పార్టీ నేతలపై ఎవరైనా తన నియంత్రణ చూపిస్తుండటాన్ని పగటిపెట్టారు.వీరిద్దరు దేశ ప్రయోజనాలకే కాదు, బిజినెస్ కోసం పాక్‌తో ఒప్పందాలు చేసినట్లు, ఇది ఆదానీ వ్యాపారాల కోసం భారత్‌ను అద్దుకోవడమేనని విమర్శించారు. దేశ ప్రజల ప్రాణాలను ఆదాయంగా మార్చడంలో బీజేపీ పాలనా విఫలత ఉందని అన్నారు.పాక్‌లో ఉగ్రవాదుల దాడిలో 26 మంది టూరిస్టులు చనిపోవడంపై సెక్యూరిటీ విఫలమై ఉందని, దీని బాధ్యత బీజేపీ అధికారాలకు ఉంటుందని, గతంలో ముంబై దాడిపై భారత హోమ్ మినిస్టర్ రాజీనామా చేసుకుని, అమెరికా అధ్యక్షులు తీవ్రంగా ఖండించినట్లు పోల్చారు.పాస్పోర్టు ర్యాంకింగ్లో భారతదేశం 2014 నుండి 2025 వరకు 76వ స్థానంనుంచి 148వ స్థానానికి పడిపోయిన విషయాన్ని బీజేపీ ప్రభుత్వ వైఫల్యం గా గుర్తించి, దేశం అంతర్జాతీయంగా విశ్వసనీయత కోల్పోతోందని పేర్కొన్నారు.పాక్‌తో ట్రంప్ సమానంగా చూస్తున్నదీ, పాక్‌ను సరసమైనట్లుగా ప్రోత్సహిస్తున్నదీ భారత ప్రభుత్వం అనేది ప్రజలలో తీవ్ర నిరాశ కలిగిస్తోందని, ఇలాంటి పాలన దేశ భద్రతను ప్రమాదంలో పడేసిందని వారీదైన విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీకి సన్నాహాలు

**శెనార్తి మీడియా, మానకొండూర్**



మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో మండలానికో గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయని వివరించారు.పైలెట్ గ్రామాలుగా మానకొండూర్ మండలంలో ముంజంపల్లి, శంకరపట్నం మండలంలో ఇప్పలపల్లి, తిమ్మాపూర్ మండలంలో కొత్తపల్లి, గన్నేరువరం మండలంలో గుండ్లపల్లి, బెజ్జంకి మండలంలో వీరాపూర్, ఇల్లంతకుంట మండలంలో సిరికొండ గ్రామాలు ఎంపికైనట్టు వెల్లడించారు. పైలెట్ గ్రామం మినహా మిగిలిన గ్రామాల్లో కూడా పథకాన్ని వేగంగా అమలు చేస్తామన్న ఎమ్మెల్యే, త్వరలోనే తేదీ ఖరారు చేసి లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

## పహల్గామ్ మృతులకు సంతాపంగా హనుమాన్ భక్తుల పాదయాత్ర



**శెనార్తి మీడియా, జమ్మికుంట**

పహల్గామ్ దాడిలో అమరులైన దేశ పౌరులు, సైనికుల ఆత్మ శాంతి కోసం బాలాంజనేయ స్వామి భక్తమండలి ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణం నుండి ఇల్లంతకుంట సీతారామచంద్ర స్వామి దేవస్థానం వరకు హనుమాన్ భక్తులు పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా భక్త మండలి సభ్యులు, హనుమాన్ భక్తులు పంతాటి రవి స్వామి మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాన్ని మరవలేమని, వారి ఆత్మ శాంతి కోసం పాదయాత్ర చేపట్టామని తెలిపారు. మన వీర జవాన్ల ధైర్య సాహసాల వల్లే ఈ భూమిపై స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశానికి ప్రాణాలు అర్పించిన అమరుల సేవలకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలాంజనేయ స్వామి భక్తి భజన బృందంతో పాటు పంతాటి రవీందర్ స్వామి, విలాసాగర్ సమ్మయ్య స్వామి, సముద్రాల ఐలయ్య స్వామి, శ్రీనివాస్ స్వామి, మడిపల్లి గ్రామం ఒగ్గు కళా కారుల బృందం, అధిక సంఖ్యలో హనుమాన్ మాల ధరించిన భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని వినతి

**శెనార్తి మీడియా, గన్నేరువారం**



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంపై సిపిఐ నాయకులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO)కు శనివారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మిగిలిన వేతనాలను జమ చేయాలని డిమాండ్ చేశారు. పనిస్థలాలలో తాగునీరు, విశ్రాంతి షెడ్లు, మొబైల్ టాయిలెట్ల వసతి ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, వివిధ గ్రామాల్లో నిర్మించిన పశువుల పాక శాలలకు ఇప్పటివరకు మంజూరైన డబ్బులు విడుదల కాలేదని, ఎన్నో రోజులుగా నిర్మాణాలు పూర్తయ్యి వదిలివేశారని తెలిపారు. వెంటనే ఆ డబ్బులు చెల్లించాలంటూ వినతి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, జిల్లా నాయకుడు కాంతలా అంజిరెడ్డి, యువజన నాయకులు మోలుగురి ఆంజనేయులు, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి బొమ్మకంటి ఆంజనేయులు, బుట్ల భాస్కర్, కూన కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడిలో నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు



**శెనార్తి మీడియా, వేములవాడ**

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో నూతన విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉచిత దుస్తులు, పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, విశాలమైన ఆటస్థలం లాంటి సౌకర్యాలు ఉండటంతో పాటు, ఒత్తిడి లేని విద్యా విధానం అమలులో ఉందన్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పడాలని కోరారు. అనంతరం ఇటీవల గురుకుల ప్రవేశ పరీక్షల్లో విజయాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దుర్శేటి లక్ష్మీనారాయణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ

- **జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గల ప్రైవేట్ పాఠశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపిక కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పాఠశాలలలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు 5వ తరగతి విద్యార్థులు 42 వేలు ఉపకార వేతనం, ఉచిత భోజన, వసతితో పాటు 2 జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ట్యూషన్ ఫీజు నిమిత్తం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 1వ తరగతి (డే స్కాలర్)లో ఎంపికైన విద్యార్థులకు 28 వేల రూపాయలు ఉపకార వేతనం, ట్యూషన్తో పాటు ఉచిత 2 జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల నిమిత్తం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను ఈ నెల 21వ తేదీ లోగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పాఠశాల అనుమతి ధృవీకరణ పత్రం, పాఠశాలలో సదుపాయాలు, భవనం ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత 5 సంవత్సరాల ఉత్తీర్ణత శాతం, పాఠశాలలో నిర్వహించబడుతున్న కోర్సులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలు సమర్పించాలని, అన్ని ప్రాథమిక సౌకర్యాలతో తగినంత మంచి నివాస వసతి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల ప్రైవేట్ పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు, జరిమానా

- **ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**
- **ఎస్పీ మహేశ్ బీ గితే**



**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

జిల్లావ్యాప్తంగా గడిచిన నాలుగు నెలల్లో వివిధ పోలీస్ స్టేషన్ల లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 2161 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టు ద్వారా జరిమానాలు, 43 మందికి జైలు శిక్షలు విధించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తరుచూ పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు. తాగి వాహనాలు నడపవద్దని తద్వారా జరిగే ప్రమాదాలను కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయే అంశాలపై పోలీస్ శాఖ కౌన్సిలింగ్ ద్వారా వివరిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.